"మన దేశంలో సినీ కళాకారులకు, ఆటగాళ్లకూ ఇచ్చిన ప్రాధాన్యం మేధావులకూ, సమాజసేవకులకూ ఇవ్వటం లేదు. యువతరం ముందు అందాల గ్లామర్ ప్రపంచాన్ని ఆదర్శంగా ఉంచుతున్నారు, కానీ ఆలోచనను, నిస్వార్థసేవను నేర్పటం లేదు".

పదునైన కత్తిలా ఆ గదిలో ఉన్న వారందరి హృదయాలను తాకాయి అరుణారాయ్ మాటలు.

"మన జీవితంలో ఆనందాల అనుభవాల గురించి చెప్తారు. సౌఖ్యాల గురించి చెప్తారు. కానీ మన బాధ్యతల గురించి చెప్పరు. హక్కుల గురించి చెప్పరు. గౌరవంతో బతికే హక్కు అందరిది. అందు కోసం పోరాడటం మన బాధ్యత" నిశ్చయంగా చెప్పింది ఆమె. అందరూ తలలాడించారు.



అరుణారాయ్

రియల్ స్టోరీ

# ఒక ధీర వనిత విజయగాథ

**మురళీకృష్ణ**

"మన ఊరికి రోడ్డు వేయటానికి రెండు లక్షలు ఖర్చయిందంటోంది ప్రభుత్వం. రోడ్డేది?"

అందరికీ తెలుసు, తమది గతుకుల, రాళ్లగుట్టల రోడ్డని.

"మన వైద్యకేంద్రం ఖర్చుకు రూ॥ 1.36 లక్షలు ఖర్చయిందంటున్నాయి ప్రభుత్వ లెక్కలు. కానీ ముప్పై ఏళ్ళ క్రితం కట్టడంలో ఏమైనా మార్పుందా?"

ముట్టుకుంటే పడిపోయేట్టుందా కేంద్రం. రిపేర్లు గత 30 సంవత్సరాలుగా జరగలేదు. అందరికీ తెలుసు ఆ విషయం.

"ప్రభుత్వమంటే ఢిల్లీలో కూర్చున్న పాలకులు కాదు. మనమూ ప్రభుత్వంలో భాగమే. మన కోసమని కేటాయించిన ధనం సక్రమం గా ఖర్చవుతోందో, లేదో చూసే బాధ్యత కూడా మనదే. అలా ఖర్చు చేయకపోతే ఆ ధనం ఏమయిందో, ఎవరి జేబులోకి వెళ్లిందో నిలదీసే హక్కుంది మనకు".

"వాళ్లంతా చదూకున్నోళ్లు..." ఎవరో గొణగటం వినిపించింది.

అరుణారాయ్ కళ్లు విస్ఫులింగాలను వెదజల్లాయి.

"చదువుకున్న వాళ్ల గొప్ప ఏమీలేదు. చదువుకున్నవాళ్లు ప్రతి విషయానికీ భయపడతారు. ఉన్నది పోతుందన్న భయం. అనుకున్నది కాదేమోనన్న భయం. వాళ్లని చూసి మీరు తక్కువగా భావించుకోవాల్సిన అవసరం లేదు. చదువుకున్నవాడు మోసం చేసి సమర్థించుకోవడం నేర్చుస్తాడు. అదే వాడి బలహీనత. పదండి...నాతో రండి... మన హక్కు కోసం పోరాడదాం. బాధ్యతలను నిర్వహిద్దాం..."

ఆమె మాటలకు అక్కడున్న వారందరి కళ్లల్లో పట్టుదల కదలాడింది.

సంతృప్తిగా నిట్టూర్చింది 'మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన' స్థాపకురాలు 'అరుణారాయ్'.

* * *

అరుణారాయ్ తెలిసిన వారెవ్వరూ ఆమె సామాజిక సేవిక అవుతుందని ఊహించలేదు. ఆమె తండ్రి లాయరు. ఆమె ఉన్నత విద్య చదివింది. ఐఎఎస్ పరీక్షలో ఉత్తీర్ణురాలయింది. ఆమెకు పోస్టింగ్ తమిళనాడులో వచ్చింది.

తమిళనాడు గ్రామాల్లో ప్రథమంగా పేదరికాన్ని ప్రత్యక్షంగా చూసింది అరుణ. అక్కడి ప్రజల దైన్యం ఆమె మనసును కలచివేసింది. కనీసం, మనిషిలా జీవించే హక్కుందని కూడా తెలియని దౌర్భాగ్యం ఆ ప్రజలది. వారి అభివృద్ధికోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు చేపడుతోంది. ఎంతో ధనం వెచ్చిస్తోంది.

కానీ, ఆ సొమ్ము ప్రజలను చేరటం లేదు. పథకాలు కాగితానికే పరిమితమౌతున్నాయి. ప్రజల దగ్గరకు రావటం లేదు. ఇదంతా చూస్తున్న అరుణలో ఆవేశం హద్దులు దాటింది.

ప్రజలకు అక్షరాస్యత లేదు.

వారికి తమ హక్కుల గురించి తెలియదు. ప్రభుత్వమున్నది తమకోసమేనని, అది అందని ఆకాశం లాంటిది కాదన్న గ్రహింపు కూడా వారికి లేదు. బ్రిటీష్ వాడు పోయి స్వరాజ్యం వచ్చినా ఇంకా 'ప్రభుత్వం' అంటే ఉన్న భయం పోలేదు. పాలకులను ఎన్నుకునేది తామేనని, వారున్నది తమ సేవకోసమే అన్న అవగాహన వారిలో లేదు. అన్యాయం జరిగితే న్యాయం కోసం పోరాడి సాధించుకోవచ్చని కూడా వారికి తెలియదు.

"ఇదంతా మారాలి. ఈ పరిస్థితి మారితేకానీ దేశం బాగుపడదు. అట్టడుగున అణిగి ఉన్నవారికి చైతన్యం రావాలి. ఈ మార్పుకు నాంది సమాజం లోంచి రావాలి. అలాకాక, అణిగిన ప్రజల ఆవేదనను బాహ్యశక్తులు ఆగ్రహంగా మారిస్తే సమాజం అల్లకల్లోలమవుతుంది. ద్వేషంతో దేశం రగిలిపోతుంది. కాబట్టి ప్రజలలో మార్పు ప్రేమతో సాధించాలి. విజ్ఞానంతో సాధించాలి!"

అయితే, అరుణ ప్రయత్నాలన్నిటికీ వ్యవస్థలో ఆమె భాగమవటం అడ్డుపడసాగింది. ప్రతి దానికీ నియమాలు, నిబంధనలు ప్రతిబంధకాలుగా నిలిచాయి. దాంతో ఆమె తన లక్ష్యం నెరవేరాలంటే ఉద్యోగ బంధనాలను వదుల్చుకోవాలన్న నిశ్చయానికి వచ్చింది.

* * *

ఆమెవైపు అపనమ్మకంగా చూశారు, రాజస్థాన్‌లోని 'తిలోనియా' గ్రామ ప్రజలు.



పోరాట భాగస్వాములతో అరుణ చర్చలు



ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తున్న అరుణా రాయ్

"మీరు ప్రభుత్వ రోడ్ల నిర్మాణంలో పనిచేశారు. ఆ సమయంలో మీకు కూలీ ప్రభుత్వరేట్ల ప్రకారం అందాలి. మీకు అలా ఇచ్చినట్లు కాంట్రాక్టర్లు లెక్కలు చూపించుకుంటారు. మీకు తక్కువ ఇచ్చారు. మిగిలినదంతా వాళ్ళు మిగుల్చుకున్నారు. మీరు మౌనంగా ఉంటే ఈ అన్యాయం ఇలాగే కొనసాగుతుంది. పోరాడితే కానీ న్యాయం లభించదు. అయితే ఈ పోరాటం హింసాత్మకంగా కాదు. న్యాయబద్ధంగా, శాంతియుతంగా సాగాలి" గ్రామస్థులకు బోధించింది అరుణ.

అరుణారాయ్ సాగించిన పోరాటాన్ని ఆరంభంలో అందరూ హేళన చేశారు. ఆమె గ్రామస్థుల తరఫున న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

1983లో కోర్టు తీర్పు గ్రామస్థుల పక్షాన వచ్చింది. గ్రామస్తులకు తక్కువగా అందిన జీతం డబ్బుల్ని ప్రభుత్వం చెల్లించాల్సి వచ్చింది.

ఈ విజయంతో అందరికీ అరుణా రాయ్ పట్ల నమ్మకం కలిగింది. ఒక రొకరుగా వివిధగ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలతో అరుణారాయ్‌ని ఆశ్రయించసాగారు. మిత్రులతో సంప్రదించి ఆమె 'మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన' (ఎంకెఎస్ఎస్)ను స్థాపించింది. అన్యాయానికి ఎదురు నిలచి పోరాడటం ఆరంభించింది.

భూస్వాములు పేదల భూములు ఆక్రమించటానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం అపూర్వమైంది. సంవత్సరం పైగా నిరసన ప్రదర్శనలు జరిపింది. చివరికి భూస్వాముల నుంచి 24 ఎకరాలను ప్రజలకు ఇప్పించింది. ఈ విజయంతో హక్కులను పోరాడి సాధించవచ్చన్న నిజం గ్రామ ప్రజలకు తెలిసింది. ఇలా ప్రభుత్వ నిధుల దుర్వినియోగం విషయంలో ఆమె తీవ్ర ఉద్యమాలు సాగించింది. రోడ్లు, నీటి పారుదల, పాఠశాలలు, వైద్య సదుపాయాల నిధులను అక్రమంగా కాజేసినవారి వివరాలు బహిర్గతం చేసి, ప్రజల డబ్బుతో ప్రజలకు సదుపాయాలు అందేట్లు చేసింది.

1994లో ఆమె ఓ వినూత్న కార్యక్రమం నిర్వహించింది. రకరకాల ప్రాజెక్టుల నిర్వహణలో అన్యాయానికి గురయిన ప్రజల సదస్సును ఏర్పాటుచేసింది. నలుమూలల నుంచి ప్రజలు సదస్సుకు వచ్చారు. ఒకప్పుడు నోరు విప్పేందుకు భయపడిన ప్రజలు, నిర్భయంగా అన్యాయాలను బయటపెట్టారు. తమకు జరిగిన అన్యాయాలను ఏకరువు పెట్టారు.

ఈ సదస్సులకు అరుణారాయ్, న్యాయవాదులను, న్యాయమూర్తులను, పాత్రికేయులను పిలిచేది. తాము వింటున్నది వారిలో తీవ్రమైన స్పందన కలిగించింది. ఈ వార్తలు పత్రికలలో రావటం మొదలయింది. సంపాదకీయాలు రాశారు. న్యాయస్థానాలు ఈ ఆరోపణలపై పరిశోధనలు చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేశాయి.

న్యాయం లభించని పక్షాన రాయ్ నిరసన ప్రదర్శనలు నిర్వహిం

మంత్రి సైతం దిగిరాక తప్పలేదు. అయితే, అలవాటైన రీతిలో అవినీతిపరులు అరుణరాయ్‌ను బెదిరించారు. ఆమెపై లేని నేరాలు మోపారు. ఆమెపై పోలీసుల నిఘా ఏర్పాటుచేశారు. కానీ అరుణారాయ్ తన కార్యకలాపాలు మానలేదు. మరింత విస్తృతం చేసింది.

రాజస్థాన్ గ్రామీణ ప్రాంతాలలో ప్రజల హక్కులకోసం ఆమె సాగిస్తున్న పోరాటం ఢిల్లీలోని స్వచ్ఛంద సంస్థల దృష్టిని ఆకర్షించింది. లాయర్లు, డాక్టర్లు ఆమెకు మద్దతు తెలిపారు.

"ప్రజలకోసం ఏర్పాటుచేసిన పథకాల పనితీరు ప్రజలకు తెలియాలి. వారికోసం కేటాయించిన ధనం ఎలా ఖర్చయిందో వివరాలను పరిశీలించే హక్కు ప్రజలకుండాలి" అంటూ ఆమె ధర్నాలు నిర్వహించారు.

ఆ ప్రదర్శనలకు హాజరైన ప్రజల సంఖ్యకు ముఖ్యమంత్రి సైతం దిగిరాక తప్పలేదు. అయితే, అలవాటైన రీతిలో అవి నీతిపరులు అరుణరాయ్‌ను బెదిరించారు. ఆమెపై లేని నేరాలు మోపారు. పోలీసుల నిఘా ఏర్పాటుచేశారు. కానీ అరుణారాయ్ తన కార్యకలాపాలు మానలేదు.

ప్రతి వ్యక్తికీ తెలుసుకునే హక్కుందని ఆమె సాగించిన పోరాటం దేశనేతలను ఆకర్షించింది. బ్రిటీష్‌వారు ఏర్పరచిన అఫీషియల్ సీక్రెట్ చట్టాన్ని రద్దు చేయాలని 53 రోజులు ఆమె జరిపిన నిరసన ప్రదర్శనలు ఫలించాయి. చివరికి 2000 సంవత్సరంలో రాజస్థాన్ ప్రభుత్వం 'సమాచార హక్కు' చట్టాన్ని ఏర్పరచింది.

అరుణారాయ్ స్ఫూర్తితో ఇతర రాష్ట్రాలలోనూ సమాచార హక్కు కోసం ఉద్యమాలు జరిగాయి. విజయం సాధించాయి.

* * *

ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కు కోసం అరుణారాయ్ 'ఎంకెఎస్ఎస్' ద్వారా సాగిస్తున్న పోరాటానికి గుర్తింపుగా ఆమెకు, సంస్థకు 'రామన్ మెగసెసే' అవార్డు లభించింది.

అరుణారాయ్ గురించి, ప్రఖ్యాత జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ – 'ఆమె గ్రామీణ ప్రజలను ఏకం చేసింది' అని మెచ్చుకున్నారు.

"భారతదేశ ప్రజాస్వామ్య భవిష్యత్తును గ్రామాలలో మనకు చూపించిందంటూ" అనేకమంది ప్రముఖులు అరుణారాయ్‌ని కొనియాడారు.

"ప్రజాస్వామ్యం ప్రజలది. కానీ ప్రజల న్యాయంకోసం ప్రజాస్వామ్యంలో పోరాడాల్సి రావటం శోచనీయం" అంటుంది అరుణారాయ్, తన సమాజసేవను కొనసాగిస్తూ.

●

## ఆదివారం క్విజ్ సమాధానాలు

1. జైపూర్
2. ఆశా పూర్ణాదేవి (1976లో)
3. న్యూజిలాండ్ (1893లో)
4. కైసర్-ఎ-హింద్
5. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)